# అంతర్వాహిని. బులుసు-జే-ప్రకాష్



**ఆమెకు అంగవైకల్యం ఉందని వద్దన్న వాడే మనసు మార్చుకు వచ్చాడు. అయితే ఈ సారి తిరస్కరించడం ఆమె వంతయింది - కాని ఎందుకు?**

గాలిపటానికి గల దారం తెగిపోతే అది ఎగురుకుంటూపోయి ఎక్కడ పడుతుందో తెలియదు.

ఉదజనితో నిండిన బెలూన్ ఆకసం పైకి వదిల్తే, ఉదజని ఉన్నంతసేపూ గగన విహారం చేస్తూ, ఉదజని అయిపోయాక ఎక్కడో కూలిపోతుంది.

తమ మైత్రికి గాలిపటంలాగ, బెలూన్ లాగ నగంలోనే విఘాతం కలగకుండా ఉండాలంటే శాశ్వతమైన బంధుత్వం ఏర్పరచుకోవాలి. ఇదీ - ఇందిర తండ్రీ, చతురాననం తండ్రీ ఒకరికి తెలియకుండా ఒకరు తీసుకున్న నిర్ణయం.

'ఒక శుభ దివసాన ఇందిర తండ్రి చతురాననం తండ్రిని కలిసి - "చాలా రోజుల్నించీ నీతో ఒక ముఖ్య విషయం ముచ్చటించా లనుకుంటున్నానురా. ఇప్పుడు సమయం చిక్కింది. మీ అబ్బాయిని మా అల్లుడుగా చేసుకోవాలని ఉందిరా!" అన్నాడు.

"నాకూ అలాగే ఉందిరా. మీ అమ్మాయిని మా కోడలిగా స్వీకరించాలని ఉంది!" అన్నాడు చతురాననం తండ్రి.



ఉభయులూ ఆనంద భరితు లయ్యారు.

సినిమా కథల్లో ఓ ముసలాడు చనిపోతూ తన మిత్రుని చేతిలో చేయి వేయించుకుని "మా అమ్మాయిని నీ కోడలిగా చేసుకోవాలిరా!" అని ప్రమాణం చేయించుకుంటాడు.

సినిమా కథ వేరు. నిజ జీవితం వేరు. పెద్దల ఇద్దరి మధ్యా ఒప్పందం కుదిరింది. కాబోయే జీవిత భాగస్వాముల మధ్య అవగాహన కుదరాలి కదా?

చతురాననాన్ని వివాహం చేసుకుందుకు ఇందిర అంగీకారం తెలిపింది.

చతురాననం మాత్రం ఇందిరని ఇల్లాలిగా చేసుకోడానికి సమ్మతించలేదు. కారణం ఇందిరలోని అంగవైకల్యం'!

ఈ విషయాన్ని చతురాననం తండ్రి ఇందిర తండ్రికి భారావహమైన గుండెతో, గద్గదికమైన గొంతుతో అతి బాధాకరంగా చెప్పాడు.

"సరే - దానికి నువ్వేం చెస్తావులే. ఎక్కడ ఘటనుంటే అక్కడే అవుతుంది" - అని సముదాయిస్తాడు ఇందిర తండ్రి.

** ** **

ఇక వధువులవేట ప్రారంభించాడు చతురాననం.

తనకు వధువు నచ్చితే, వధువు తననీ నచ్చలేదు. వధువుకు తను నచ్చితే, తనకు వధువు నచ్చలేదు. ఇలా ఇరవై ముప్పయ్ సంబంధాలు చూశాడు. వధువుల ఎంపికలో రెండు వార్షికోత్సవాలు జరుపుకున్నాడు.

ఈలోగా తండ్రి కాలం చేశాడు.

ఇక గత్యంతరం లేక భూమి గుండ్రంగా ఉన్నట్లు మరోసారి రుజువు చేశాడు. ఇందిరనే వివాహం చేసుకుంటాననీ, ఆమెకు అంగవైకల్యం ఉండడం వల్లనే ఆమె పట్ల ప్రగాఢ సానుభూతితో తనకు జీవిత భాగస్వామినిగా స్వీకరించ దలచాననీ ఒక మిత్రుని ద్వారా ఉత్తరం పంపాడు.

ఇందిర నుంచి ప్రత్యుత్తరం వచ్చింది:

"చతురాననంగార్కి అభినందనలతో-

"రుక్మిణీదేవి ఆనాడు అగ్నిద్యోతనుడు అనే మధ్యవర్తిని కృష్ణుని దగ్గరకు రాయబారం పంపినట్టు, ఈనాడు మీరు మరో మధ్యవర్తి ద్వారా నా దగ్గరకు ఒక లేఖతో పాటు రాయబారం పంపారు. కృతజ్ఞత. వికలాంగుల్ని వికలాంగులే వివాహం చేసుకుంటే ఒకరి కొకరు సహకరించుకునే అవకాశం ఉండదనీ, అంచేత వికలాంగుల్ని వికలాంగులు కాని వారు వివాహం చేసుకోడం కనీస ధర్మం అని మీ ఆదర్శాన్ని చాటిచెప్పినందుకు ధన్యవాదం! అయితే ప్రయాగలోని త్రివేణీ సంగమంలో ఈనాడు సరస్వతీ నది అంతర్లీనమై అంతర్వాహినిగానే ఉన్నట్టు, మీ 'ఆదర్శంలో' అంతర్లీనమైన కోరిక ఉన్నట్లు నాకు అనిపిస్తోంది.

"నాకు అంగవైకల్యం కొత్తగా రాలేదు. జన్మతః ఉన్నదే! ఇంతక్రితం నన్ను మీ అర్ధాంగిగా స్వీకరించమని మా నాన్నగారు కోరినప్పుడు - అంగవైకల్యం ఉన్న వాళ్ళని చేసుకుంటే మీ స్నేహితుల మధ్య చిన్నతనంగా ఉంటుందనీ, ఒకవేళ ఏ సినిమా కెళ్ళినా కుంటుకుంటూ హాల్లో అడుగుపెడితే నలుగురిలోనూ అవమాన భారంతో క్రుంగిపోవలసి వస్తుందనీ మీరు భావించారు. ఆనాటి నేను వికలాంగురాలిని ఈనాడు కోమలాంగిని అయిపోయినా? అది మీ మనోవైకల్యం మాత్రమే! ఈనాడు మళ్ళీ నన్ను మీ అర్ధాంగిగా చేసుకోడానికి మీరు సిద్ధపడ్డారంటే నా మీద మీకు జాలి అని భావించను. వికలాంగుల కోటాలో ఉద్యోగం సంపాదించిన ఉద్యోగస్తురాల్ని! మీ రెండు వేలతోనూ మీరు తాగుడూ, జూదమూ, వ్యభిచారంతోను జల్సాలు చేస్తే - నా రెండు వేలతోనూ కుటుంబ పోషణ చేసుకుంటూ, మీకు వండి పడుండి, సుఖాల్నిస్తూ పిల్లల్ని కనే యంత్రంలా నేనుండాలన్నది - మీలో అంతర్లీనంగా ఉన్న ధ్యేయం!

"కాబట్టి మీ ఆఫర్‌ని తిరస్కరిస్తున్నాను!

"ఇట్లు - ఇందిర"

*

# తపన

డా. దేవరాజు మహారాజు

చూపు నీరై పారుతుంది
చూపే దాహ మవుతుంది
చూపు దారై నడుస్తుంది
చూపే గమ్య మవుతుంది
చూపు ధ్యేయమై నిలుస్తుంది
చూపే ఆచరణ మవుతుంది.

★

కనికరం కనరాని చోట
చూపు బూజై దీనంగా వేలాడుతుంది
చూపు క్రూరమైనప్పుడు
పమిట, తప్పించుకు తిరుగుతుంది
చూపు గడ్డ కట్టిన చోట
హృదయం ద్రవించదు!
చూపు అగ్గై మండొచ్చు
మంచై జివ్వు మనొచ్చు
వెచ్చ నవొచ్చు, చల్లబడొచ్చు
ప్రకటించనూ వచ్చు
వికటించనూ వచ్చు

★

చూపు - కళ్ళలో గుండు సూదులు పొడిచే
హింస కావొచ్చు
సమస్యను సుతిమెత్తగా సరికే
డబుల్ బ్లేడ్ రేజర్ కావొచ్చు
ఒక లేజర్ కిరణం కావచ్చు
లేకపోతే, లేబర్ మరణమూ కావొచ్చు

★



చెట్ల చూపును స్పృశించిన బోసు
ఈ దేశపు జెండాను భూగోళం మీద ఎగరేశాడు
భూమి గుండెల్ని పసి చూపుల్తో తట్టండి
తల్లి పాలు నీళ్ళయి పొంగుకొస్తాయి
సమయం చూసి ఆకాశ వృక్షాన్ని
చూపుతో కుదపండి
దోరగా పండిన వర్షం కాయలు
టప టపా రాలతాయి
సముద్రంలో చూపులు తిప్పండి
సూనెలు శు ద్ధౌతాయి

★

ఈ నిరంతర యానంలో
శోధన ఒక కొత్త చూపు
చూపు కళ్ళకే కాదు
వేళ్ళకూ ఉంది, చెట్టు వ్రేళ్ళకూ ఉంది
స్కానింగ్, బయాప్సీ
మైక్రోస్కోపిక్ ఇన్వెస్టిగేషన్
చూపులోని తీవ్రతను
తీవ్రం చేస్తున్నాయి

★

అయితే, ఒక్కోసారి,

చూపు ఉన్నా, చూపు ఉండకపోవచ్చు
చూపు లేకపోయినా లోచూపు ఉండొచ్చు!

★